## సిపిఐ ప్రచార జాతాను జయప్రదం చేయండి

### పార్టీ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు




**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** సిపిఐ వందేండ్ల ముగింపు ఉత్సవాలలో భాగంగా ఈనెల 26వ తేదీన ఖమ్మంలో నిర్వహించే సభను జయప్రదం చేయాలని కోరుతూ ఈనెల 23, 24 (నేడు, రేపు) తేదీలలో సూర్యాపేట జిల్లాలో సాగే ప్రచార జాతాకు నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికి జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో కోరారు. బాసర నుండి ఖమ్మం వరకు ఈ ప్రచార జాత సాగుతుందని నేడు జిల్లాలోని తిరుమలగిరి, నాగారం, తుంగతుర్తి, మద్దిరాల, నూతనకల్, నెమ్మికల్ మీదుగా రాత్రి 7 గంటలకు సూర్యాపేటకు చేరుకుంటుందని తెలిపారు. ఈనెల 24న సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఉదయం 10 గంటలకు సభ నిర్వహించడం జరుగుతుందని అనంతరం చివ్వెంల మండల కేంద్రానికి 12 గంటలకు జాతా చేరుతుందని చెప్పారు. ఈ జాతాకు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని పార్టీ శ్రేణులను కోరారు.

---

## మహిళలను కోటీశ్వరులుగా చేయడానికి రైస్ మిల్లులు ఏర్పాటు చేయిస్తాం

### నల్లగొండ నుండే పైలట్ పద్ధతిలో ప్రారంభించేందుకు చర్యలు

### ఇందిర మహిళా శక్తి చీరల పంపిణీలో మంత్రి కోమటిరెడ్డి




**ప్రజాపక్షం/నల్లగొండ :** రాష్ట్ర ప్రభుత్వం కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తెచ్చిదిద్దాలన్న సంకల్పంతో మహిళల కోసం ఉచిత బస్సుసౌకర్యం,బస్సులు, పెట్రోల్ బంకులు, మహిళా శక్తి క్యాంటీన్ల నిర్వహణ ద్వారా ఆర్థికంగా వారి కాళ్లపై వారు నిలబడేందుకు చర్యలు తీసుకుంటున్నదని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు.ప్రభుత్వమే మహిళా సంఘాలకు రుణం మంజూరు చేసి ఆర్అండ్‌బి శాఖ ద్వారా రైస్ మిల్లులు నిర్మిస్తామని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు.శనివారం అయన జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఉన్న ఉదయాదిత్య భవన్లో ఇందిర మహిళా శక్తి చీరల పంపిణీకార్యక్రమంలో భాగంగా స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులకు చీరలను పంపిణీ చేశారు. మహిళలను కోటీశ్వరులను చేయడంలో భాగంగా రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా పైలెట్ పద్ధతిన నల్లగొండ జిల్లాలో మహిళల చేత రైస్ మిల్లులు ఏర్పాటు చేయిస్తామని, జిల్లాలో రైస్ మిల్లుల కొరతను ఈ విధంగా తీరుస్తామని,ఇందుకుగాను వారికి ముందుగా రుణాలు అందజేసి రైస్ మిల్లులను వారే నిర్వహించుకునేలా దానిపై వచ్చే లాభం ద్వారా ప్రతినెల తీసుకున్న రుణాలు తిరిగి చెల్లించేలా, తద్వారా లాభం పొందే విధంగా చర్యలు చేపడతామని మంత్రి తెలిపారు. ఇందుకుగాను అవసరమైన స్థలాలను చూడాలని జిల్లా కలెక్టర్ ను ఆదేశించారు. ఈ విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి వచ్చే క్యాబినెట్ సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా రైస్ మిల్లులు ఏర్పాటు చేసే విషయంపై చర్చించి నిర్ణయం తీసుకునేలా చూస్తామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 29 వేల కోట్ల రూపాయలు ఇందిరమ్మ ఇండ్లపై ఖర్చు చేయడం జరుగుతున్నదని,400 కోట్లతో నల్లగొండ జిల్లాలో డబుల్ రోడ్లు నిర్మిస్తున్నామని చెప్పారు.ఈ సందర్భంగా మంత్రి ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ తో పాటు, నల్గొండ నియోజకవర్గానికి సంబంధించి రెండు కోట్ల 20 లక్షల రూపాయల విలువ చేసే కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి,రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు డాక్టర్ హఫీజ్ ఖాన్, ఇన్చార్జి డిఆర్‌డిఓ అశోక్ రెడ్డి, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మాధవి ,మార్కెట్ కమిటీ చైర్మన్ రమేష్, డిసిసిబి డైరెక్టర్ సంపత్ రెడ్డి పాల్గొన్నారు.

---

## వ్యర్థాలను కాల్చేస్తూ......ఆరోగ్యాన్ని పాడుచేస్తూ!

### నందికొండలో హాస్పిటల్స్ నిర్వాహకుల నిర్వాకం



**ప్రజాపక్షం/నందికొండ:** ఆసుపత్రులో వ్యర్థాల పార బోత బయోమెడికల్ వ్యర్థాలు, గడువు తీరిన మందులు జనావాసాలకు దగ్గరలో యథేచ్ఛగా పారేస్తూ దహనం చేస్తున్నారు దీనితో ఆ పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నట్లు ఆ ప్రాంత ప్రజలు తమ గోడును వెళ్లబోస్తున్నారు.వివరాల్లోకి వెళితే నందికొండ మున్సిపాలిటీ లోని స్థానిక ప్రభుత్వ ఏరియా కమల నెహ్రూ ఆసుపత్రి ప్రాంగణంలో ఆసుపత్రి వ్యర్థాలతో ఆ ప్రాంతమంతా కంపు కొడుతూ ఉండటంతో ఆ పరిసరాల్లో నివసిస్తున్న ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు గడువుతీరిన ఔషధాలతో కలిపి రోగినుంచి వచ్చిన బాడీ ఫ్లూయిడ్స్,డ్రెస్సింగ్ వేస్ట్,బ్యాగ్స్,రక్తంతో ఉన్న వేస్ట్, ఎక్స్పైరీ మందులు రోగి శరీరంలో అమర్చి ఆ తర్వాత పడేయాల్సిన ట్యూబ్లు, యూరినల్ బ్యాగ్స్, సిరంజిలు, నీడిల్స్ వంటి వ్యర్థాలను ఆటోక్లేవింగ్ లేదా మైక్రోవేవింగ్ హైడ్రోక్లేవింగ్ పద్ధతుల్లోనే నిర్వీర్యం చేయాలి. వాటిని మామూలు ఉష్ణోగ్రత వద్ద దహనం చేయటం శనివారం కనిపించింది వాటిని మామూలుగా నిప్పు పెట్టినప్పుడు తక్కువ ఉష్ణోగ్రత తో 200 నుంచి 600 డిగ్రీల సెంటీగ్రేడ్ వద్ద మాత్రమే దహనం జరుగుతుంది . వ్యర్థాలు, ఔషధాలు నాశనం కావాలంటే కనీసం 800 నుంచి 1200 డిగ్రీలు కావాలి. తక్కువ ఉష్ణోగ్రతలో వ్యర్థాల రసాయనాలు పూర్తిగా దహనం కాకపోవడంతో వాటి నుంచి వెలువడే పొగ దహనం అవుతున్నపుడు వచ్చే దుర్వాసనతో తాము అనేక ఇబ్బందులకు గురి అవుతున్నామని దుర్వాసనకి భోజనం కూడా సహించడం లేదనిఆ పరిసర ప్రాంతాల్లోని ప్రజలు వాపోతున్నారు అవి అధిక ఉష్ణోగ్రత వద్ద దహనం కాకపోతేడయాక్సిన్స్, ఫ్యూరాన్లు విడుదలవుతాయి. డయాక్సిన్లు అనేవి నీటిని కలుషితం చేస్తాయి పీవీసీ ప్యాకేజింగ్లో ఉన్న వాటిని కాల్చడం వల్ల విష వాయువులు వెలువడే వాటితో పర్యావరణం పాడవటంతో పాటు క్యాన్సర్కు కారణమవుతాయని ఔషధ రంగ నిపుణులు చెబుతున్నారు.

---





## గ్రామాల అభివృద్ధే లక్ష్యం

### ఎమ్మెల్యే వేముల వీరేశం

**ప్రజాపక్షం/ రామన్నపేట:** గ్రామాల అభివృద్ధే తన లక్ష్యమని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. శనివారం మండలంలోని వెల్లంకి గ్రామంలో రూ.10లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించి, సిరిపురం గ్రామంలో రూ.12లక్షల వ్యయంతో నిర్మించనున్న అంగన్‌వాడి భవనం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి రూ.15లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి, బోగారం గ్రామంలో రూ.5లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి, నీర్నెముల గ్రామంలో రూ.30లక్షల వ్యయంతో నిర్మించనున్న డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ సిరిగిరెడ్డి మల్లారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నంద్యాల భిక్షం రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

### పేదల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

పేదల అభ్యున్నతికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జేపీ గార్డెన్‌లో మండలంలోని 69 మందికి కళ్యాణలక్ష్మీ , షాదీముబారక్ చెక్కులను, 28 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసి స్వయం సహాయ సంఘాల మహిళలకు చీరెలను పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ ఆడబిడ్డలకు నాణ్యమైన చీరెలను అందిస్తుందని, గత ప్రభుత్వం మహిళలకు నాసిరకం చీరెలను పంపిణీ చేసి నిధులను దోపిడి చేసిందన్నారు. ప్రజా ప్రభుత్వంలో పేదలకు ఇందిరమ్మ ఇండ్లు, ఉచిత బస్సు, 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్, వడ్డీలేని రుణాలు అందిస్తూ మహిళల అభ్యున్నతికి కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో పీడీ, ఆర్డీవో, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

---

## నల్లగొండ డిసిసి అధ్యక్షుడిగా కైలాష్ నేత



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** డిసిసి అధ్యక్షులను ఎట్టకేలకు కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ప్రకటించింది. నల్లగొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా పున్న కైలాష్ నేత నియమితులయ్యారు. డిసిసికి పలువురు పోటీ పడ్డప్పటికీ మునుగోడుకు చెందిన పున్న కైలాష్ నేతనే డిసిసి వరించింది.తెలంగాణ విద్యార్థి జేఏసీ వ్యవస్థాపక సభ్యులు ఓయూ కేంద్రంగా ఓయూ అధ్యక్షుడిగా టి ఎస్ జేఏసీ అధికార ప్రతినిధిగా ఎన్నికై తెలంగాణ ఉద్యమంలో 45రోజులపాటు జైలు జీవితం గడిపారు. 153 కేసులు నమోదు అయ్యాయి. 2014 తెలంగాణ ఏర్పాటుతో సోనియాగాంధీ కృతజ్ఞతగా కాంగ్రెస్‌లో చేరారు.2014, 2018, 2023, 2024 వరకు మునుగోడు ఎంఎల్ఏ టిక్కెట్టు ఆశించి బంగపడ్డారు. ఎట్టకేలకు డిసిసి అధ్యక్షుడిగా కైలాష్ నేతను అధిష్టానం ప్రకటించింది.

## పంచాయతీ రిజర్వేషన్‌లపై నేడు సమావేశం

**ప్రజాపక్షం/చిట్యాలః** గ్రామ పంచాయతీ వార్డు సభ్యుల రిజర్వేషన్‌లపై రాజకీయ పక్షాలకు నల్లగొండ జిల్లా చిట్యాల మండల పరిషత్ కార్యాలయంలో నేడు సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపిడివో జయ లక్ష్మి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అత్యవసరంగా ఏర్పాటు చేస్తున్న ఈ సమావేశం ఉదయం 11 గంటలకు ఏర్పాటు చేయనున్నట్లు ఆమె పేర్కొన్నారు. అన్ని పార్టీలకు చెందిన ప్రతినిధులు, నాయకులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆమె తెలిపారు.

## ఇసుక రీచులను పరిశీలించిన అధికారులు



**ప్రజాపక్షం/అర్వపల్లి :** జాజిరెడ్డిగూడెం మూసీ పరిధిలో గల తుంగగూడెం, పేరబోయినగూడెం ఇసుక రీచ్‌లను పోలీస్, రెవెన్యూ అధికారులు పరిశీలించారు. ఇసుక రీచ్‌ల వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులను, సీసీ కెమెరాలు పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. చెక్ పోస్టులో సీసీ కెమెరాల ద్వారా అక్రమంగా జరిగే ఇసుక అక్రమ రవాణాను అరికట్టవచ్చని, అక్రమ రవాణా నిర్వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అర్వపల్లి మండల తహశీల్దార్ బి శ్రీకాంత్, నాగారం తహశీల్దార్ హరికిషోర్ శర్మ, నాగారం సిఐ నాగేశ్వరరావు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం

**ప్రజాపక్షం/చిట్యాలః** సిపిఐ(ఎం) పార్టీలో క్రీయాశీలకంగా పనిచేస్తూ ఇటీవల మృతి చెందిన గుంటోజు వీరయ్య కుటుంబ సభ్యులకు పార్టీ గ్రామ శాఖ నాయకులు శనివారం ఆర్థిక సహాయాన్ని అందించారు. నాయకులు వసూలు చేసిన రూ. 16వేలను పార్టీ సీనియర్ నాయకులు బొంతల చంద్రారెడ్డి చేతుల మీదుగా వీరయ్య కుటుంబ సభ్యులు భారతమ్మ, సిద్ధప్పలకు అందజేశారు. ఆర్థిక సహాయం కోసం ముందుకు వచ్చిన పార్టీ సభ్యులను చంద్రారెడ్డి ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు నెలకంటి నర్సింహ్మా, పంది నరేష్, నాతి వెంకట్రామయ్య, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

## కార్మికుల హక్కులను కాలరాసిన మోదీ సర్కార్

**ప్రజాపక్షం/గరిడేపల్లి :** కార్మికుల హక్కులను రద్దు చేసిన మోడీ సర్కార్ తగిన మూల్యం చెల్లించుకుంటుందని సిఐటియు జిల్లా నాయకులు ఎస్‌కె యాకూబ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎమ్మెస్ భవనంలో సిఐటియు జనరల్‌బాడీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంతోకాలంగా కార్మికులు పోరాడి తెచ్చుకున్న 24 లేబర్ కోట్లను రద్దు చేయడం హేయమైన చర్య అన్నారు. ఈనెల 25న సూర్యాపేటలో జరిగే సిఐటియు జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సత్యం నర్సిరెడ్డి, త్రిపురం సరిత, వెంకటరమణ, రామారావు నాయక్, హేమగాని వెంకన్న, శ్రావణ్, సైదులు పాల్గొన్నారు.



## రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించిన తరువాతే ఎన్నికలు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన మాట ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రాజకీయ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించిన తరువాతనే ఎన్నికలు నిర్వహించాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ అన్నారు. శనివారం ఆయన పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ బీసీలకు స్థానిక ఎన్నికల్లో 42శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించిన తరువాతనే ఎన్నికలకు వెళ్తామని కాంగ్రెస్ ప్రకటించి నేడు మాట తప్పిందని, కాంగ్రెస్‌పై బీసీలు తిరగబడే సమయం ఆసన్నమైందన్నారు. రాజకీయ పార్టీలు బీసీలను కేవలం ఓటు పరంగానే వాడుకుంటున్నాయే తప్పా బీసీలకు న్యాయంగా దక్కాల్సిన రిజర్వేషన్లు అందించడం లేదన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించకుండా ఎన్నికలు నిర్వహిస్తే మాత్రం తెలంగాణ రాష్ట్రంలో బీసీలు చేసే పోరాటానికి పూర్తి బాధ్యత ప్రభుత్వమే వహించాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో పగిడి జీడయ్యయాదవ్, పోలగాని వెంకటేష్‌గౌడ్, జక్క నాగేశ్వర్‌రావు, ఎర్రబెల్లి గంగాధర్, నరసింహా, శంకర్, ఉదయ్ పాల్గొన్నారు.

## విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



**ప్రజాపక్షం/కోదాడ రూరల్ :** విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని కోదాడ రూరల్ ఎస్ఐ గోపాల్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ద్వారకుంట నెమలిపురి గురుకుల బాలుర పాఠశాల, కళాశాలలో ట్రాఫిక్ రూల్స్, డ్రగ్స్, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, షీ టీమ్స్ పనితీరుపై పోలీస్ కళాబృందంతో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షీ టీమ్స్, డ్రగ్స్, సైబర్ నేరాలపై, రోడ్డు ప్రమాదాలపై పటిష్టంగా పనిచేస్తున్నామని తెలిపారు. ప్రతి స్కూల్, కాలేజీలలో చదువుకునే విద్యార్థులు ఇంటర్నెట్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సైబర్ మోసగాళ్ళ వల్ల మోసాలకు గురికావద్దని సూచించారు. ఎవరైనా ఆకతాయిలు ఆడపిల్లలను, మహిళలను వేధింపులకు గురిచేస్తే సూర్యాపేట షీ టీం నంబర్ 8712686056 కి సమాచారం ఇవ్వాలన్నారు. విద్యార్థులందరూ క్రమశిక్షణ కలిగి తల్లిదండ్రులను గురువులను గౌరవించాలని తెలిపారు. ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకొని లక్ష్య సాధనకై కృషి చేసి ఆ దిశగా విజయం సాధించి సమాజంలో మంచిపేరు తెచ్చుకోవాలన్నారు. అనంతరం పోలీస్ కళాబృందం వారు చక్కటి సాంస్కృతిక, పాటలతో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గురుకుల ప్రిన్సిపాల్ శ్రీరామ్, ఏఎస్ఐ మల్లయ్య, హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మి నారాయణ, కానిస్టేబుల్ శ్రీనివాసరావు, రామనర్సయ్య, కళాబృందం ఇంచార్జి యల్లయ్య, సభ్యులు గోపయ్య, చారి, సత్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విజన్ కళాశాల 'వనభోజనాలు'



**ప్రజాపక్షం/ కోదాడ** :మండల పరిధి దోరకుంట శివారు ఇండ్రస్టీయల్ పార్కు సమీపంలో పట్టణానికి చెందిన ఏర్నేని వెంకటరత్నంబాబుకు చెందిన మామిడి తోటలో శనివారం పట్టణ విజన్ కళాశాల వారు విద్యార్థులతో వనభోజనాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ గోలి సైదయ్య మాట్లాడుతూ కంప్యూటర్ యుగంలో మన సంస్కృతి,సంప్రదాయాలు మరుగున పడుతున్నాయని, వాటిని ముందు తరాలకు తీసుకు వెళ్లేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు. వనభోజనాలు సమానత్వనాకి, ప్రకృతిని దేవతగా పూజించు సంప్రదాయం దాగి ఉందని గుర్తు చేశారు. విద్యార్థులు నిత్యం పుస్తకాలతో కుస్తీ పట్టు వారు ప్రకృతిలో కొంత మానసిక ఆనందాన్ని పొందుతారని, స్నేహ బంధన్ని బలపరుచుకుంటారని తెలిపారు. అనంతరం విద్యార్థులతో కూడి సహపిక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అంజాద్, డైరెక్టర్లు అశోక్, షరీఫ్, సైదిరెడ్డి, సీతరాం, సాదిక్, శ్రీనివాసరావు, అధ్యపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లకు భూమిపూజ

**ప్రజాపక్షం/సూర్యాపేట (సూర్యాపేట రూరల్) :** మండలంలోని యల్కారం గ్రామంలో మిద్దె ఝాన్సీ శ్రవణ్‌ల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి గ్రామ కాంగ్రెస్ నాయకులతో కలిసి ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి శనివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సకాలంలో ఇండ్లు పూర్తి చేసుకొని ప్రభుత్వం అందిస్తున్న రూ.5లక్షల ఆర్థిక సహాయం పొందాలని కోరారు.



## జూనియర్ వాలీబాల్ సెలక్షన్స్

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి జూనియర్ విభాగంలో బాలబాలికలకు వాలీబాల్ సెలక్షన్స్ నిర్వహించనున్నట్లు ఉమ్మడి నల్లగొండ జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షులు గండూరి ప్రకాష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25న ప్రభుత్వ జూనియర్ కళాశాల సూర్యాపేట నందు జరుగు పోటీలలో పాల్గొనే క్రీడాకారులు 01.01.2008 తర్వాత జన్మించి ఉండాలని సూచించారు. పాఠశాల విద్యార్థులు బోనఫైడ్ సర్టిఫికెట్, ఇంటర్ విద్యార్థులు పదవ తరగతి మెమో, జనన ధృవీకరణ పత్రం, ఆధార్ కార్డుతో తప్పనిసరిగా ఉదయం 9 గంటల వరకు హాజరుకావాలని కోరారు.



## టిఆర్‌జిఎస్ రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశాన్ని జయప్రదం చేయండి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఈనెల 29న నల్లగొండ పట్టణ కేంద్రంలోని లెక్చరర్స్ భవన్‌లో నిర్వహించే తెలంగాణ రాష్ట్ర గిరిజన సంఘం రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశాన్ని జయప్రదం చేయాలని సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ధీరావత్ రవినాయక్ డిమాండ్ చేశారు. శనివారం విస్తృత సమావేశ కరపత్రాన్ని ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో గిరిజన తెగల మధ్య వైశమ్యాలు రెచ్చగొడుతూ పబ్బం గడుపుకోవాలని చూస్తున్న కొంతమంది కుహానా గిరిజన నాయకులకు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. తెలంగాణ రాష్ట్ర గిరిజన సంఘం గిరిజన చైతన్య యాత్రలను నిర్వహించి గిరిజనుల మధ్య వచ్చిన అశాస్త్రీయ వైరుధ్యాలను తొలగించి రాష్ట్రంలోని గిరిజన తెగల మధ్య ఐక్యత సాధించడం కోసం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో సంఘం ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు శ్రీనునాయక్, నాయకులు రమేష్‌నాయక్, అశోక్‌నాయక్, శ్రీనునాయక్, సైదానాయక్, నాగనాయక్, వస్రంనాయక్ పాల్గొన్నారు.

## పంట పొలానికి దారి ఇవ్వడం లేదని సబ్ కలెక్టర్‌కు రైతు ఫిర్యాదు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మండలంలోని అన్నారం గ్రామ శివారులోని సర్వే నెం.144లో ఉన్న తన ఎకరం భూమికి దారి ఇవ్వడం లేదంటూ రైతు ధనావత్ కిషన్‌నాయక్ శనివారం సబ్ కలెక్టర్ నారాయణ్అమిత్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బాధిత రైతు కిషన్‌నాయక్ మాట్లాడుతూ ఈ ఏడాది వానాకాలం పంట సాగు చేసేందుకు తాను పొలం వద్దకు వెళ్లగా ధనావత్ నాగ, ధనావత్ శ్రీను, ధనావత్ రిబ్బన్, ధనావత్ జానులు అడ్డుకున్నారని తెలిపారు. దీంతో ఎకరం పొలం బీడుగా ఉంచామన్నారు. గతంలో ఇదే విషయమై తాను ఫిర్యాదు చేయగా రెవెన్యూ అధికారులు వచ్చి సర్వే చేశారని ఇప్పటివరకు నివేదిక ఇవ్వకపోవడంతో తాను పంట పండించుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. రూరల్ పోలీసులకు సైతం ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఇప్పటికైనా అధికారులు స్పందించి కౌలు రైతు సెక్షన్ 251 ప్రకారం తన పంట పొలానికి వెళ్లేందుకు దారి ఇప్పించాలని కోరారు.

## పాలకులు అనుసరిస్తున్న విధానాలపై ఉద్యమించాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** పాలకులు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్ రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో బొంత శ్రీనివాస్ రెడ్డి 18వ వర్ధంతిని సిపిఎం జిల్లా కమిటి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివైఎఫ్ఐ కోదాడ డివిజన్ అధ్యక్షుడిగా, మునగాల మండలం తాడువాయి గ్రామ సింగిల్ విండో చైర్మన్‌గా పనిచేస్తూ నిరుద్యోగ యువతీ, యువకులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం సమరశీల పోరాటాలు చేశారని గుర్తు చేశారు. నేటి యువత ఆయన జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని ఆకాంక్షించారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నెమ్మాది వెంకటేశ్వర్లు, మట్టిపెల్లి సైదులు, కోట గోపి, వెల్పుల వెంకన్న, జె నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.





## విజ్ఞాన విహార యాత్రలు విద్యాబోధనలో భాగం

ప్రజాపక్షం/కోదాడ: విద్యార్థులకు తరగతి గదిలో బోధనతో పాటు విజ్ఞాన, విహార యాత్రలు విద్యాబోధనలో భాగమేనని మండల విద్యాధికారి ఎం.డి సలీం షరీఫ్ అన్నారు. శనివారం కోదాడ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు విజ్ఞాన యాత్రకు బయలుదేరిన బస్సులకు జెండా ఊపి అనంతరం మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో చరిత్రకు సంబంధించిన విషయాలను వివరించేందుకు అస్కారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం డి.మార్కండేయ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రం పరిశీలన



ప్రజాపక్షం/అర్వపల్లి : మండల పరిధిలోని రామన్న గూడెం మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గ్రామ పంచాయితీ వార్డు వారీగా పోలింగ్ కేంద్రాలను జిల్లా పంచాయితీ అధికారి యాదగిరి శనివారం పరిశీలించారు. పాఠశాలలో ఎన్నికలపరంగా ఏర్పాటు బూతులను, ఓటర్ల సంఖ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మండల ఎంపిడిఓ ఝాన్సీ, ఎంపిఓ గోపి, గ్రామ పంచాయితీ కార్యదర్శి సుధాకర్, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పంచాయితీ సిబ్బంది ఉన్నారు.

## జాతీయస్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపికైన మోడల్ స్కూల్ విద్యార్థి

ప్రజాపక్షం/వలిగొండ : వలిగొండ మండలం లోతుకుంట గ్రామంలోని మోడల్ స్కూల్ విద్యార్థి గుండు ఉదయ్ (అండర్ 19) భువనగిరిలో జరిగిన రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రాయిసున్నీసా బేగం పత్రిక ప్రకటనలో తెలియజేశారు. ఈనెల 30 నుండి డిసెంబర్ 5 వరకు జిల్లాలో జాతీయస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొంటాడని మోడల్ స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ జి.ఐలయ్య తెలియజేశారు. మండల విద్యాధికారి సుంకోజు భాస్కర్, ఉపాధ్యాయులు శేఖర్, సతీష్ రాజ్, సీతారామరాజు, లింగస్వామి, రాజు అభినందించారు.




# ఉద్యోగాలను భర్తీ చేయాలి



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : మెరిట్ లో ఉన్న అభ్యర్థుల నుండి జాబితాను రూపొందించి ఉద్యోగాలను భర్తీ చేయాలనీ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దుదుకు లక్ష్మీనారాయణ,జాతీయ ఉపాధ్యక్షులు మిరియాల యాదగిరి అన్నారు. శనివారం నల్లగొండలోని బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యాలయం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశములో వారు మాట్లాడుతూ 2015 గ్రూపు 2 ఉద్యోగాల భర్తీలో జరిగిన జవాబు పత్రాలను దిద్ది మార్పులు చేర్పులు చేసి ఉద్యోగాలు పొందిన దాని పై హై కోర్టు కేసు ను న్యాయమూర్తి విచారించి ఉద్యోగాలు పొందిన వారిని తొలగించి , ఆతరువాత మెరిట్ లో ఉన్న అభ్యర్థుల నుండి జాబితాను రూపొందించి ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు.దీనిపై ఉద్యోగాలు కోల్పోతున్న అభ్యర్థులు డివిజన్ బెంచ్కు ఆశ్రయించడం సుధీర్ఘంగా వాదనలు విన్న బెంచ్ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సమర్ధిస్తూతీర్పు ఇవ్వనుందని తెలిపారు.ఇంతకాలం ఉద్యోగాలు చేసిన వారిని తొలగించడం మూలంగా ,వారికి వయసు మించి పోవడం, సమీప భవిష్యత్తుల్లో పోటీ పరీక్షలు వ్రాసి ఉద్యోగాలు పొందే అవకాశంలేదు.కాబట్టి వారిని మానవతా దృక్పథంతో కొనసాగిస్తూ,పోస్ట్ క్రియేట్ చేసి,మెరిట్ జాబితాను రూపొందించి అర్హులైన వారికి ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు,జిల్లా కోశాధికారి జేరిపోతుల రమేష్ గౌడ్,విద్యార్థి వర్కింగ్ ప్రెసిడెంట్ కట్ట హరి బాబు తదరులున్నారు.

# 'రెయిన్‌బో' లో బాలల దినోత్సవ వారోత్సవాలు




ప్రజాపక్షం/కొండమల్లేపల్లి; మండల కేంద్రంలోని రెయిన్‌బో ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జన్మదినం సందర్భంగా నవంబర్ 14 నుండి ప్రారంభం అయిన బాలల దినోత్సవ వారోత్సవాల చివరి రోజు శనివారం విద్యార్థుల నృత్య ప్రదర్శనతో ఘనంగా ముగించారు. చిత్రలేఖనం, వ్యాసరచన, ఉపన్యాస పోటీలు, సంభాషణ పోటీ, అక్షర క్రీడా, ఆటలు, పాటల పోటీలు నిర్వహించి విద్యార్థులలో దాగిఉన్న ప్రతిభను గుర్తించామని కరస్పాండెంట్ ఆనంద్‌రెడ్డి అన్నారు. ఈకార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఆనంద్‌రెడ్డి, ప్రిన్సిపల్ పర్వీన్ సుల్తానా, ఉపాధ్యాయులు బాలయ్య, పుష్ప, శ్రీలత, శైలజ, నాగమణి, కళ్యాణి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అయ్యప్ప మహా పడిపూజ



ప్రజాపక్షం/బీబీనగర్ : కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బండారు ఆగమయ్య గౌడ్ గురు స్వామి ఆధ్వర్యంలో మండల కేంద్రం పిఆర్‌జి ఫంక్షన్ హాల్‌లో జరిగిన అయ్యప్ప మహా పడిపూజ కార్యక్రమానికి భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అయ్యప్ప పూజలు చేసి భక్తి మార్గాన్ని పొందాలని భక్తులను కోరారు. అనంతరం భక్తులకు అల్పాహారం విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు గోలి పింగళి రెడ్డి, బంజారా రామాంజనేయులు గౌడ్, పోటోల శ్యామ్ గౌడ్, గోలి నరేందర్ రెడ్డి, కాసుల ఆంజనేయులు గౌడ్, పంజాల వెంకటేష్ గౌడ్, గూడూరు నిఖిల్ రెడ్డి, బద్దం వాసుదేవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చేనేత కార్మికుల రుణమాఫీ నిధులు విడుదల పట్ల హర్షం



ప్రజాపక్షం/మోత్కూర్ : చేనేత వృత్తిని నమ్ముకొని జీవనం సాగిస్తున్న చేనేత కార్మికులకు రుణమాఫీ కోసం రూ.33 కోట్లు విడుదల చేయడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, చేనేత జౌళి శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వరరావు, తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం అధ్యక్షుడు కమర్థపు మురళిలకు చేనేత కార్మిక సంఘం చేనేత రాష్ట్ర ఉపాధ్యక్షులు పోచం కన్నయ్య కృతజ్ఞతలు తెలిపారు. శనివారం మోత్కూర్ పద్మశాలి కాలనీలో జరిగిన చేనేత కార్మికుల సమావేశంలో సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చేనేత కార్మికుల పరిశ్రమకు తీవ్ర నష్టం కలిగిస్తున్న డూప్లికేట్ ప్రింటింగ్ వస్త్రాలను అరికట్టాలని, జియో ట్యాగ్ కలిగిన ప్రతి చేనేత కార్మిక కుటుంబానికి నేతన్నభరోసా పథకం వర్తింపజేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మోత్కూర్ మండల చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు వంగరి రాములు, వంగరి యాదగిరి, పోచంరాజు, దొర్నాల మత్స్యగిరి, వంగరి ధనమ్మ, పోచం లక్ష్మి, రేగోటి రమాదేవి, గుర్రం అంబ దాస్, తాటి లక్ష్మణ్, కందుల వెంకన్న, తవిటి హరినాథ్ పాల్గొన్నారు.



## గుర్తింపు కార్డులు, క్రీడా దుస్తులు పంపిణీ

ప్రజాపక్షం/మోటకొండూరు : మోటకొండూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సూదగాని ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ డైరెక్టర్ సూదగాని రామదాసు విద్యార్థినీ, విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్‌తో పాటు ఐడెంటిటీ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాందాసు గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి, శ్రద్ధతో చదువుకోని మంచి ఫలితాలు తీసుకరావాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చదువుకునే విద్యార్థులకు తమ ఫౌండేషన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, మంచి ర్యాంకులు సాధించేందుకు ప్రోత్సహిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు కె.రాజగోపాల్, ఉపాధ్యాయులు శ్రవణ్ కుమార్, విశ్వరూపం, భవానీ, మల్లేశం, ఫరూక్, రమేష్, సూదగాని ఫౌండేషన్ ప్రతినిధులు పల్లె నరేష్ గౌడ్, మాచన రాము పాల్గొన్నారు.

## బిసి రాజ్యాధికార మండల అధ్యక్షుడిగా సిలివేరు శ్రీధర్



ప్రజాపక్షం/కొండమల్లేపల్లి; బిసి రాజ్యాధికార సమితి కొండమల్లేపల్లి మండల అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన సిలివేరు శ్రీధర్‌ను శనివారం మండల కేంద్రంలో జరిగిన దేవరకొండ నియోజకవర్గ సమావేశంలో కన్వీనర్ కర్ణకంటి కిరణ్ నియమించినట్లు తెలిపారు. ఈసందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి తన నియామకానికి సహకరించిన బిసి రాజ్యాధికార సమితి ఉమ్మడి నల్గొండ జిల్లా కో ఆర్డినేటర్ చిరంజీవి, నల్గొండ జిల్లా అధ్యక్షుడు, బిసి జేఏసి జిల్లా కన్వీనర్ కర్నాటి యాదగిరిలకు కృతజ్ఞతలు తెలిపారు. బిసిల రిజర్వేషన్లు, హక్కులు, ఆశయ సాధన కోసం బిసిలను ఐక్య పరిచి కృషి చేస్తానని అన్నారు. ఈకార్యక్రమంలో బిసి రాజ్యాధికార సమితి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కర్ణకంటి రజినీకాంత్, బోడ నాగరాజుయాదవ్, గందూరి రఘుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కోతులను తరలించాలని వినతి



ప్రజాపక్షం/కొండమల్లేపల్లి; కొండమల్లేపల్లి పట్టణంలో కోతులు, వీధి కుక్కలను పట్టి సుదూర మైన అడవి ప్రాంతానికి తరలించాలని కోరుతూ శనివారం తిరుమలనగర్‌కు చెందిన కాలనీ వాసులు కొండమల్లేపల్లి పంచాయతీ కార్యదర్శి డాకునాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగ వారు మాట్లాడుతూ మండల కేంద్రంలో కోతులు, కుక్కలతో చిన్నా, పెద్దలు తేడా లేకుండా అందరు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ అధికారులు తక్షణమే స్పందించి కోతులు, కుక్కల నుండి ప్రజలను కాపాడాలని కోరారు. ఈకార్యక్రమంలో తిరుమల నగర్ కాలనీ వాసులు గుమ్మకొండ వెంకటేశ్వర్‌రెడ్డి, సురకారపు చిన్న మారయ్య, నీల లక్ష్మయ్య, జటమోని యాదయ్య, బుచ్చిరెడ్డి, కరుణాకర్, కొండల్‌రెడ్డి, కామిశెట్టి శ్రీను పాల్గొన్నారు.

# కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి

ప్రజాపక్షం/బీబీనగర్ : కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్ బిల్‌లను వెంటనే రద్దు చేయాలని గ్రామపంచాయతీ వర్కర్ల మండల అధ్యక్షులు నాంపల్లి భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం బీబీనగర్ మండల కేంద్రానికి వచ్చిన ఎంపీ, ఎమ్మెల్యేలకు పంచాయతీ వర్కర్ల ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. గ్రామపంచాయతీ వర్కర్లకు కనీస వేతనం అమలు చేసి ప్రభుత్వ ఖజానా నుండి జీతాలు అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు పైల్ల గణపతి రెడ్డి, రాష్ట్ర మహిళా కన్వీనర్ పొట్ట యాదమ్మ పాల్గొన్నారు.





## పకడ్బందీగా పరీక్షలు

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** విద్యార్థులు మాల్ ప్రాక్టిస్‌కు పాల్పడకుండా పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం అడిషనల్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ అధికారి లక్ష్మీ ప్రభ అన్నారు. శనివారం ఆమె స్థానిక శ్రీక్రాంతి డిగ్రీ కళాశాలలో జరుగుతున్న డిగ్రీ ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరం పరీక్షల సరళిని పరిశీలించారు. విద్యార్థులకు ఏర్పాటు చేసిన మౌలిక వసతులను పరిశీలించారు. ఆమె వెంట సిట్టింగ్ స్క్వాడ్ సతీష్, ప్రిన్సిపల్ గుంటోజు ఆంజనేయులు, ఏవో గోవర్ధన్‌రెడ్డి, నరేంద్ర చారి తదితరులు ఉన్నారు.

## కబ్జా నుండి మా భూమిని విడిపించండి



**ప్రజాపక్షం/వలిగొండ :** మండలంలోని అరూర్ గ్రామంలో చిట్టేటి సుమలతకు సంబంధించిన సర్వే నెంబర్ 708/ఆలో ప్రభుత్వ భూమి అసైన్మెంట్ గల భూమిని గత కొద్ది సంవత్సరాల నుండి అదే గ్రామానికి చెందిన చిట్టేడి నరసింహారెడ్డి కబ్జా చేసి బెదిరిస్తున్నారని దయచేసి ఉన్నతాధికారులు స్పందించి భూమిని సర్వే చేసి మా భూమిని మాకు ఇప్పించ చాలని సుమలత ప్రతాపరెడ్డి, బోగారం మంజుల కిష్టయ్యలు శనివారం తహసిల్దార్‌కి వినతి పత్రం అందజేశారు.

## ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించిన హౌసింగ్ ఎఇ

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇల్లు పథకం ఇల్లు లేని పేదలకు ఆసరాగా నిలుస్తున్నాయని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు తుర్కపల్లి మండలం గొల్లగూడెం గ్రామంలో శరవేగంగా కొనసాగుతున్నాయని హౌసింగ్ ఏఈ నరేష్ అన్నారు. తుర్కపల్లి మండలంలోని గొల్లగూడెం గ్రామంలో చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఇంటి నిర్మాణం చేస్తున్న మేస్త్రీతో మాట్లాడి లబ్ధిదారులకు పేమెంట్ విషయంలో తక్కువ తీసుకోవాల్సిందిగా సూచించారు. గొల్లగూడెం గ్రామంలో ఐదు బేస్మెంట్ లెవెల్, రూఫ్ లెవెల్‌లో ఉన్నాయని, స్లాబ్ లెవల్‌లో నాలుగు ఇండ్లు నిర్మాణం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సెక్రెటరీ రోజా, గ్రామ శాఖ అధ్యక్షుడు గూడ రాజిరెడ్డి, ఇందిరమ్మ ఇండ్ల కమిటీ మెంబర్స్ బబ్బూరి సాయికుమార్, మైలారం శ్రీనివాస్, ధరావత్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# బిజెపి, కాంగ్రెస్ కార్యాలయాల ముందు ధర్నా

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** ఈ నెల 24న బీసీ జన సభ రాష్ట్ర అధ్యక్షులు రాజారాం యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించే బిజెపి, కాంగ్రెస్ పార్టీ కార్యాలయాల ముందు శాంతియుత ధర్నా విజయవంతం చేయాలని బీసీ జన సభ జిల్లా నాయకులు పుట్ట వీరేష్ యాదవ్ అన్నారు. శనివారం భువనగిరి పట్టణంలోని రాఘవేంద్ర హోటల్‌లో శాంతియుత ధర్నాకు చెందిన వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీసీ జన సభ జిల్లా నాయకులు పుట్ట వీరేష్ యాదవ్ మాట్లాడుతూ రాజ్యాంగ సవరణ చేయాల్సిన బాధ్యత కాంగ్రెస్, బిజెపిలదే అని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చాకే స్థానిక సంస్థ ఎన్నికల నిర్వహించాలని అన్నారు. పార్టీ పరంగా రిజర్వేషన్లు ఇచ్చి ఎన్నిక నిర్వహిస్తే రాష్ట్రం అగ్నిగుండమే అని అన్నారు. ఈ కార్యక్రమంలో బిసి



సంఘం జిల్లా నాయకులు నక్కల చిరంజీవి యాదవ్, పద్మశాలి సంఘం యువజన జిల్లా అధ్యక్షులు మిర్యాల శ్రీనివాస్ నేత, మేరు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొత్త ఆంజనేయులు, యాదవ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గుండబోయిన సురేష్ యాదవ్, మాజీ ఎంపిటిసి రసాల మల్లేష్ యాదవ్, శ్రీరాం శరత్ యాదవ్, నవీన్ యాదవ్, పబ్బతి హరీ కృష్ణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# సీనియర్ ఉపాధ్యాయులకు టెట్ మినహాయించాలి



**ప్రజాపక్షం/ రామన్నపేట:** సీనియర్ ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష తప్పని ఉత్తీర్ణత సాధించాలని, లేనట్లయితే రెండేళ్లలో సర్వీస్ నుంచి తొలగిస్తామని విధానాలను రూపొందించడం అన్యాయమని ఉపాధ్యాయ సంఘాల నాయకులు శనివారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. సీనియర్ ఉపాధ్యాయులకు టెట్‌ను రద్దు చేయాలన్నారు. చట్ట సవరణ తీసుకొచ్చి మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఇన్ సర్వీస్ శిక్షణ ద్వారా ఉత్తీర్ణత సాధింప చేయాలని, ప్రస్తుత టెట్ విధానంలో మార్పులు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో టీఎస్‌యుటీఎఫ్ జిల్లా కార్యదర్శి కంచి రవికుమార్, నాయకులు సిలివేరు అనిల్‌కుమార్, మంకాల కుమారస్వామి, పల్లె మోహన్‌రెడ్డి, కట్ల కృష్ణ, సోమిరెడ్డి, ఉదయశ్రీ, నజీబ్, శిరీష, నవిత, ఉయ్యాల భిక్షం, సురేష్, రాములు, రామచంద్రారెడ్డి, సత్యనారాయణ, నిర్మలదేవి, సంతోష్, కవిత, శ్రీలత, రేణుక, లింగస్వామి, నరేందర్, భార్గవి, ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

# చట్టబద్ధ రిజర్వేషన్లు కల్పించకపోతే పార్టీలను బహిష్కరించాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** తెలంగాణ రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లు చట్టబద్ధంగా 42శాతం కల్పించకపోతే జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలను బహిష్కరించాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు పోగుల సైదులుగౌడ్ పిలుపునిచ్చారు. అన్ని రాజకీయ పార్టీలు రిజర్వేషన్ల పైన డ్రామాలాడుతున్నాయని ఒక్కో పార్టీ ఒక్కొక్క వంకతో బీసీలను మోసం చేస్తున్నాయని అన్నారు. రాజకీయ పార్టీలు బీసీ రిజర్వేషన్లు కల్పించే ఆలోచన లేదని, బీసీలను మోసం చేయడం ధ్యేయంగా పార్టీలు పనిచేస్తున్నాయని అన్నారు. ఇప్పటికైనా పార్టీల్లోని అగ్రకుల నాయకుల దగ్గర మోకరిల్లకుండా బీసీ రిజర్వేషన్లకై పోరాటం



చేయాలన్నారు. చట్టబద్ధంగా రిజర్వేషన్లను అమలు చేయకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే పార్టీలకతీతంగా స్వతంత్ర్య అభ్యర్థులుగా బీసీలందరు పోటీ చేయాలని, పోటీ చేసిన వారికి బీసీ ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కర్నాటి శివరామకృష్ణ, ఎరుకల మల్లేష్‌గౌడ్, పోగుల నరసింహా, సన్ని, సంతోష్‌కుమార్, కృష్ణ, గోపి తదితరులు పాల్గొన్నారు.

# బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను 9వ షెడ్యూల్లో చేర్చాలి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** బీసీలకు విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల ఎన్నికలలో 42 రిజర్వేషన్లు కల్పించాలని, పార్లమెంట్లో బిల్లును ఆమోదింపజేసి రాజ్యాంగ సవరణ చేసి 9వ షెడ్యూల్లో చేర్చాలని బీసీ జేఏసీ చైర్మన్ మునన ప్రసన్నకుమార్ అన్నారు.జిల్లా కేంద్రంలోజిల్లా బీసీ జేఏసీ కమిటీ ఆధ్వర్యంలో కుల సంఘాలు అన్ని రాజకీయ పార్టీలో ఉన్న బీసీ నాయకుల సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ప్రసన్నకుమార్ మాట్లాడుతూ బీసీలకు విద్యా ఉద్యోగ రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి దేశంలో ఉన్న 50 శాతం రిజర్వేషన్ల పరిమితిని ఎత్తివేయాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో జనాభా తమాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని సాధించేంతవరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దుడుకు లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బీసీ జేఏసీ జిల్లా గౌరవ అధ్యక్షులు చీర పంకజ్ యాదవ్,కొలగాని పర్వతాలు,గుంటోజు వెంకటాచారి,గౌరవ సలహాదారులు చిలకరాజు చెన్నయ్య,మిర్యాల యదగిరి,విద్యార్థి జేఏసీ జిల్లాచైర్మన్ అయితగోని జనార్దన్ గౌడ్, మైనారిటీ జేఏసీ చైర్మన్ అబ్బుల్ ఖదీర్, ప్రధాన కార్యదర్శి గజ్జి అజయ్ యాదవ్, మార్గం సతీష్,చిలకరాజు సతీష్‌కుమార్,వడ్డెబోయిన రామకృష్ణ పాల్గొన్నారు.






## వల్లభాయ్ పటేల్ 150వ జయంతి

**ప్రజాపక్షం/దేవరకొండ;** దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్, మేరా యువభారత్ వారి ఆధ్వర్యంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక జెడ్పి హెచ్‌ఎస్ వద్ద ముఖ్య అతిథులు ఆర్డీవో రమణారెడ్డి, సిఐ వెంకట్ రెడ్డి, అధ్యక్షులు ఎన్‌విటి, రాజేష్, మేరా భారత్ డిస్ట్రిక్ ఆఫీసర్ సభ్యులు మరియు విద్యార్థులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ సమైక్యత, దేశభక్తిని పెంపొందించడం ప్రత్యేకించి జాతిని ఏకీకృతం చేయడంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ పాత్ర మరువలేనిదని అన్నారు. ఈకార్యక్రమంలో నక్క వెంకటేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ మద్దిలేటి సుధాకర్, ఎంకే నాయక్, నరేందర్‌రెడ్డి, ఉమామహేష్, నిరంజన్, అమర్, సురేష్, ఆంజనేయులు, గోపి, వివిధ పాఠశాలల విద్యార్థులు, క్రీడాకారులు, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

## యూరియా కొరత రావొద్దు



**ప్రజాపక్షం/వేములపల్లి:** రైతులకు యూరియా కొరత రాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జవ్వాజి సత్యనారాయణ అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో రైతులు యూరియా కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగి నానా అవస్థలు పడ్డారని అలాంటి పరిస్థితి రాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకొని సహకార బ్యాంకులతో పాటు ఫర్టిలైజర్ షాపులలో యూరియా అందుబాటులో ఉండేలా చూడాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పెదమాం భరత్, జిల్లా కౌన్సిల్ సభ్యులు చిర్ర సాంబమూర్తి, బిజెపి కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి కర్ర దామోదర్ రెడ్డి, మండల పార్టీ ఉపాధ్యక్షులు పెద్దమాం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## స్మశాన వాటిక నిలిపి వేయాలని వినతి

**ప్రజాపక్షం/మర్రిగూడ:** మండలంలోని నూతనంగా ఏర్పాటైన రాజాపేట తండా గ్రామ పంచాయితీలోని సర్వే నెంబర్ 316లో నూతనంగా ఏర్పాటు చేయబోయే స్మశాన వాటిక నిలిపి వేయాలని ఆప్రాంత రైతులు శనివారం తాహసిల్దార్ జక్కర్తి శ్రీనివాస్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈసందర్భంగా రైతులు మాట్లాడుతూ సర్వే నెంబర్ 320 లో సర్వే చేసి అక్కడ నిర్మాణం చేస్తామని స్థల పరిశీలన చేసినారు.అక్కడ వద్దని కొంత మంది అడ్డుకోవడం జరిగింది.తర్వాత, సర్వేనెంబర్ 288లో సర్వే స్థల పరిశీలన చేసి,288 నెంబర్‌లో గతంలో ఫీల్డ్ వర్క్ కూడా చేయడం జరిగింది.జిల్లా కలెక్టర్ వచ్చి అక్కడ పని మొదలు పెట్టించి పిల్లర్లు కూడా వేసినారు.పరిశీలనకు అక్కడికి వెళ్లి ఈ చుట్టుపక్కల రైతులు నాకు మర్రిగూడకు సంబంధించిన రైతుల భూములు ఉన్నాయి. కాబట్టి సర్వేనెంబర్ 316, లో అదేవిధంగా మదేలమ్మ దేవాలయము శివాలయం గుడి దేవస్థానము, ఎందుకంటే అక్కడ చుట్టుముట్టు మర్రిగూడ రైతుల భూములు ఉన్నాయి. అదేవిధంగా సర్వేనెంబర్,316 లో సర్వే నెంబర్లు దేవస్థానము ఉన్న పురాతన మదేల్ అమ్మ దేవాలయము ఉన్నందున రైతులు పూజించుకుంటారు. ఇక్కడ ఎలాంటి నిర్మాణాలు చేపట్ట వద్దని తాసిల్దార్ కు మెమో రాందం సమర్పించారు. ఇచ్చినవారు పగడాల లింగయ్య, మాధగోని చిన్నబ్బాయి, పగడాల శ్రీరాములు, గుణగంటి వెంకటేష్, పగడాల రఘు, పగడాల స్వామి, మాధగోని పెద్దబ్బాయి ,ఉన్నారు.



## నేడు సత్యసాయిబాబా శతజయంతి వేడుకలు

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** భగవాన్ శ్రీసత్య సాయి బాబా శతజయంతి వేడుకలను జిల్లా కేంద్రం లోని ఎమ్మార్వో కార్యాలయం ఎదురుగా గల సత్రంబ జార్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించనున్నట్లు శ్రీస త్యసాయిసేవా సమితి కన్వీనర్ వెంకటరమణ శని వారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా ఆదివారం ఉదయం సుప్రభాతం, 100 జ్యోతులతో మహానగర సంకీర్తనతో కార్యక్రమాలు ప్రారంభమై రుద్రాభిషేకం, ముఖ్య అతిధులచే జ్యోతిప్రజ్వలన, బాలవికాస్ విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయి. మధ్యాహ్నం నారాయణ సేవ ఏర్పాటు చేయబడుతుందని, సాయంత్రం 6 గంట లకు భజనలు నిర్వహించి మహా హారతితో వేడుకలు ముగిస్తాయని తెలిపారు. భగవాన్ శతజయంతి వేడుక లను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా గుర్తించినట్లు పేర్కొన్నారు. భక్తులందరూ అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## దేవస్థానంలో ఎస్‌సి ఉద్యోగులు లేరా?



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** యాదగిరిగుట్ట దేవస్థానంలో అర్హత గల ఎస్సీ ఉద్యోగులు లేరా అని ఎమ్మార్పీఎస్ జాతీయ పొలిటి బ్యూరో సభ్యుడు మంద శంకర్ మాదిగ ప్రశ్నించారు. యాదగిరి కొండపై ప్రధాన కార్యాలయంలో డీఈవో భాస్కర శర్మకు వినతి పత్రం అందజేసి ఆయన మాట్లాడారు. ఓసి, బిసిలకు ఎన్ని అడ్డంకులు ఉన్నా పదోన్నతులు ఇచ్చి ఎస్సీలకు మాత్రమే నిలిపివేయడం కారణమేంటని నిలదీశారు. ఎస్సీ ఉద్యోగుల్లో పర్యవేక్షకుడి పదోన్నతికి అర్హులు ఉన్నప్పటికీ కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. ఐదు నెలలకు కావస్తున్నప్పటికీ పోస్టు ఎందుకు భర్తీ చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో జిల్లా కార్యదర్శి బూడిద జానీ, మండల అధ్యక్షుడు ఆకారపు లక్ష్మీ నారాయణ, తుర్కపల్లి మండల కన్వీనర్ కరుణాకర్ ఉన్నారు.

## దీపారాధనతో ముగిసిన ఉర్సు ఉత్సవాలు

**ప్రజాపక్షం/అర్వపల్లి :** అర్వపల్లి శివారులోని హజ్రత్ సయ్యద్ ఖాజా నసీరుద్దీన్ బాబా దర్గా ఉర్సు ఉత్స వాలు శనివారం దీపారాధనతో ముగిసాయి. శుక్ర వారం సాయంత్రం గంధం ఊరేగింపు జరగగా అర్ధ రాత్రి నుంచి శనివారం తెల్లవారుజాము వరకు ఖవ్వాలి కార్యక్రమం నిర్వహించారు. శనివారం రాత్రి దర్గాలో దీపారాధన (చిరాగ్) నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గా లోపల, బయట భక్తులు వందలాది దీపాలను వెలిగించారు. దీపారాధన అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ మహమూద్, స్థానిక ఎస్ఐ సైదులు, ముజావర్ సయ్యద్ అలీ, అబ్దుల్ హుస్సేన్, అంజద్, కర్నాని రమేష్, మున్నా పాల్గొన్నారు.



# సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట వృద్ధ తల్లి నిరసన



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** తన పోషణ బాగోగులు చూసుకునే విధంగా న్యాయం చేయాలని వృద్ధ మహిళ తన ఇద్దరు కూతుళ్లతో కలిసి పురుగుల మందు డబ్బాతో శనివారం రాత్రి స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి సంఘటన చోటు చేసుకుంది. మిర్యాలగూడ మండలం అవంతీపురం గ్రామానికి చెందిన ఉప్పతల సుగుణ తన కొడుకు తన కున్న ఎకరం పది గుంటల వ్యవసాయ పొలం రాయించుకోని తనను ఇంటి నుంచి గెంటి వేసినట్లు తెలిపారు. న్యాయం కోసం జిల్లా కలెక్టర్‌కు, ఎస్పీకి, సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. న్యాయం కోసం ఎక్కడికి వెళ్లినా అధికారులు స్పందించకపోవడంతో చనిపోవాలని నిర్ణయించుకున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తన కున్న వ్యవసాయం పొలం కూడా రాయించుకోని కొడుకు తనను పోషించడం లేదని చెప్పారు. వయో వృద్ధుల చట్టం కింద తన భూమిని, ఇంటికి తనను ఇప్పించి న్యాయం చేయాలని కోరారు. ఈ విష యంపై స్పందించిన తహసీల్దార్ సురేష్‌కుమార్ విచా రించి న్యాయం చేస్తామని హామి ఇవ్వడంతో ఆందో ళన విరమించుకున్నారు.

# పారదర్శకంగా చీరెల పంపిణీ



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మహిళల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ చీరెల పంపిణి కార్యక్రమాన్ని పారదర్శ కంగా చేపట్టాలని సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ అన్నారు. శనివారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆయన మహిళలకు ఇందిరమ్మ చీరెలను పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిర్యాలగూడ డివిజన్‌లోని అన్ని మండలాల్లో మహిళ లకు పంపిణి చేసేందుకు 55,945 చీరెలను అందిం చినట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేప ట్టిన ఇందిరమ్మ చీరెల పంపిణి కార్యక్రమాన్ని ఎలాంటి పొరపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాల న్నారు. కార్యక్రమంలో ఏవో సత్యనారాయణశర్మ, తహసీల్దార్ సురేష్‌కుమార్, డీటీ ప్రవీణ్‌కుమార్, ఆర్ఐ కృష్ణయ్య, నిజాముద్దీన్, మధు, జానకి, సీసీలు వినీల, హైమావతి, విజయకుమారి, కవిత, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ చీరలు పంపిణీ

ప్రజాపక్షం/అడ్డగూడూరు : కాంగ్రెస్ ప్రభుత్వం నాణ్యమైన ఇందిరమ్మ చీరలు మహిళలకు పంపిణీ చేస్తుంది అని ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఇందిరమ్మ చీరలు పంపిణీ కార్యక్రమంలో పాల్గొని చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఉక్కుమనిషి ఆమె పేరుతో అనేక సంక్షేమ పథకాలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమలు చేస్తు న్నారన్నారు. మంత్రి సీతక్క పర్యవేక్షణలో నాణ్యమైన చీరెలు కోటిమంది మహిళలకు పంపిణీ చేస్తామని చెప్పారు. గత ప్రభుత్వంలో పంపిణీ చేసిన చీరలు మహిళలు వాడకుండా ఉన్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో అధికారులు ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాలు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తలు సిద్ధం కావాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** రానున్న స్థానిక సంస్థల ఎన్ని కలకు కార్యకర్తలు సిద్ధం కావాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్ అన్నారు. శనివారం స్థానిక సీపీఎం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై కార్యకర్తలు పోరాటాలు చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ప్రజలు పోరాటాలు చేసి సమస్యలను పరిష్క రించే మంచి నాయకుడిని ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వీరేపల్లి వెంకటేశ్వర్లు, మల్లు గౌతంరెడ్డి, రవి నాయక్, రాగిరెడ్డి మంగారెడ్డి, అయూబ్ పాల్గొన్నారు.

## నేడు చీరల పంపిణీ

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** రాష్ట్ర ప్రభుత్వం ఇందిరా మహిళ శక్తి ద్వారా స్వయం సహాయక సంఘాలు, మహిళలకు అందచేసే చీరల పంపిణీ కార్యక్రమ ప్రారం భోత్సవానికి నేడు తుర్కపల్లి మండ లానికి ఆలే రు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య రానున్నారని ఐకెపి అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ రమణ తెలిపా రు. ఉదయం 10 గంటలకు తుర్కపల్లి జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలో చీరల పంపిణీ ఉంటుందని తెలిపారు.

## చేనేత కార్మిక సంఘం పోరాట ఫలితమే రుణమాఫీ

**ప్రజాపక్షం/ రామన్నపేట:** చేనేత కార్మిక సంఘం చేసిన పోరాట ఫలి తంగానే చేనేత కార్మికులకు ప్రభుత్వం రుణమాఫీ ప్రకటించిం దని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వనం ఉపేందర్ శని వారం అన్నారు. చేనేత కార్మకుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి, నేతన్న భరోసా వెంటనే అమలు చేయాలని, రుణ మాఫీ వర్తింప చేయాలని చేసిన మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారా ములు, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వనం శాంతికుమార్, ప్రధాన కార్యదర్శి గంజి మురళిలు చేసిన పోరాటాల ఫలితంగా ప్రభుత్వం అమలు చేసిందన్నారు. ది చేనేత కార్మిక సంఘం విజయమన్నారు.

## అన్నప్రసాద వితరణ



**ప్రజాపక్షం/దేవరకొండ;** దేవరకొండ మండలం గిరిజనగర్ తండా కు చెందిన బిఆర్‌ఎస్ నాయకులు తన అనుచరుడు నేనావత్ నాగా ర్జున నాయక్ స్వగృహంలో ఏర్పాటు చేసిన ఆంజనేస్వామి అభి షేకం కార్యక్రమంలో బిఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు బిల్యానాయక్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. నీల రవికుమా ర్, హరినాయక్, జయప్రకాష్, కిషన్, రాజు, మోతిరాం, ఉమ య్య, జైపాల్, సీతా, ఆంజనేయ, ఆయ్యప్పస్వాములు ఉన్నారు.

## అంగన్‌వాడీలను సద్వినియోగం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** అంగన్‌వాడి కేంద్రాల ద్వారా అంది స్తున్న సౌకర్యాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూపర్‌వైజర్ నాగమణి అన్నారు. శనివారం స్తానిక ఈదులగూడ అంగన్‌వాడి కేంద్రాలను ఆమె సందర్శించి మాట్లాడారు. పిల్లల మానసిక, శారీరక ఎదుగుదులకు అంగన్‌వాడి కేంద్రంలో ఆటపా టల ద్వారా విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా తల్లిదం డ్రులకు బాల్య వివాహాలు, భ్రూణహత్యలు, అక్రమ దత్తత నిర్మూల నపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్లు బొందు పార్వతి, రామానుజమ్మ, హెల్పర్ వి.లక్ష్మి, జి.లక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

## సన్నవడ్ల కొనుగోలుపై రైతుల ఆందోళన

**ప్రజాపక్షం/మర్రిగూడ:** మండలంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొను గోలు కేంద్రంలో సన్న వడ్లను తీసుకోకుండా సెంటర్ ఇన్చార్జి ఇబ్బందులకు గురి చేస్తున్నాడని శనివారం రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.సన్న ధాన్యాన్ని సుమారు 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఖుదా బాక్స్ పల్లి సెంటర్కు తీసుకువెళ్లాలని ఇన్చార్జి చెప్తున్నా రని రైతులు ఆరోపించారు. దీనివల్ల రవాణా ఖర్చు పెరిగి నష్ట పోతున్నామన్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

## వధూవరులకు ఆశీర్వాదం

**ప్రజాపక్షం/మర్రిగూడ:** బిఆర్‌ఎస్ నేత,మాజీ మంత్రి హరీష్ రావు శనివారం నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయనకు అత్యంత సన్నిహితులైన దేశ్ ముఖ్‌కి, కొద్ది రోజుల క్రితం వివాహం జరుగగా,ఆ సమయంలో హరీష్ రావు తండ్రి మరణించడంతో వివాహానికి హాజరు కాలేక పోయారు.అందువల్ల దేశ్ ముఖ్ నివాస మైన మండల కేంద్రానికి వచ్చిన ఆయన నూతన జంటను ఆశీర్వ దించారు. ఈ కార్యక్రమంలో మాజీ మునుగోడు శాసనసభ్యులు కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి,చిరుమర్తి లింగయ్య,ఉజ్జిని యాదగిరి రావు,బిఆర్‌ఎస్‌రాష్ట్ర నాయకురాలు పాల్వాయి స్రవంతి,కర్నె ప్రభా కర్,బాలల హక్కుల కమిషన్ మాజీ చైర్మన్ అంజన్ రావు ఉన్నారు.



# గ్రామపంచాయతీ ఎన్నికలకు రంగం సిద్ధం



- ఈనెల 26న నోటిఫికేషన్ విడుదల
- డిసెంబర్ 11,14,17 తేదీలో ఎన్నికలు
- పాతప్రక్రియే కొనసాగింపు
- ఏజెన్సీ కావడంతో ప్రభావం అంతంత మాత్రమే
- పదేళ్ల తర్వాత భద్రాచలం, తాళ్లగొమ్మూరు జిపిల్లో ఎన్నికలు

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** పంచాయితీ పోరుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇందు కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం ఈనెల 26వ తేదిన ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయనుంది. పాతపద్ధతి ప్రకారం బిసి రిజర్వేషన్ 42 శాతంతోనే ఎన్నికలు వెళునున్నారు. ఈ ఎన్నికలు డిసెంబర్ 11,14,17 తేదీల్లో మూడు విడతల్లో జరగనున్నాయి. సెప్టెంబర్ లోనే ఎన్నికలు జరగాల్సి ఉన్నప్పటికీ ఉన్నప్పటికీ బిసి రిజిర్వేషన్ ప్రక్రియలో కొర్రీలు ఏర్పడటంతో ఆలస్యమైంది. ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారో చెప్పాలంటూ ప్రభుత్వాన్ని హై కోర్టు ప్రశ్నించడంతో రాష్ట్ర ప్రభుత్వం చేసేది లేక పాత పద్దతిలోనే బిసి రిజర్వేషన్ 42 శాతంతో సర్పంచ్ ఎన్నికలకు సిద్ధమైంది. కాగా ఈనెల 26వ తేదిన రాష్ట్ర ఎన్నికల సంఘం ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదల చేయనుండగా ఈ ఎన్నికలు డిసెంబర్ 11,14,17 తేదీల్లో మూడు విడతసుగా జరపేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. తాజా ఓటర్ జాబితా ప్రక్రియలో భాగంగా ఈనెల 23వరకు సవరణలు, జాబితాలో సవరణలు, పోలింగ్ కేంద్రాల మార్పులు చేర్పులు ప్రకటించనుండగా సోమవారం పాతపద్ధతిలోనే గ్రామాల వారీగా రిజర్వేషన్ రోస్టర్‌ను జిల్లాలో సోమవారం విడుదల చేయనున్నారు.

### ప్రక్రియ పాతదే...

బిసి రిజర్వేషన్ వ్యవాహారంతో ఆగిపోయిన ఎన్నికలు పాతపద్ధతిలోనే నిర్వహించనున్నారు. బిసి రిజర్వేషన్ 42 శాతం ప్రకారం ఎన్నికలకు వెళ్లేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. జిల్లా ఏజెన్సీ ప్రాంతం కావడంతో బిసి రిజర్వేషన్ అ పద్దతిలో అమలు చేసినా పెద్ద ప్రభావం ఏమీ ఉండదని అధికారులు చెబుతున్నారు. గ్రామపంచాయితీ ఎన్నికలకు సంబంధించి అభ్యర్ధులు ఎలాంటి పార్టీ గుర్తులు లేకుండా స్వతంత్ర గుర్తులతో భరిలో నివాల్సి ఉంటుంది.

### 471 జిపిలు, 4168 వార్డులు...

జిల్లాలోని 471 గ్రామపంచాయితీలు ఉండగా 4168 వార్డులున్నాయి. వీటిలో మొదటి విడతలో 159 గ్రామపంచాయితీలు, 1436 వార్డులకు, రెండో విడతలో 198 గ్రామపంచాయితీలు1392 వార్డులకు, మూడో విడతలో 156 పంచాయితీల్లో 1340 వార్డులకు మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇందు కోసం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. గత నెల్లో ఎన్నికలు జరిపేందుకు రంగం సిద్ధం చేసి కొందరి వద్ద నుండి నామినేషన్లు సైతం స్వీకరించారు. అప్పుడు సిద్ధం చేసిన పోలింగ్ సామాగ్రిని ఇప్పుడు వాడనున్నారు.

### మొత్తం ఓటర్లు 6,69,048 మంది...

జిల్లాలో గ్రామీణ ఓటర్లు మొత్తం 6 లక్షల 69వేల 48 మంది ఉండగా, ఇందులో పురుషులు 3,25,045 మంది, మహిళలు 3,43,979 మంది, ఇతరులు 24 మంది ఉన్నారు. పరుషుల కంటే 18934 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు.

### భద్రాచలం, తాళ్లగొమ్మూరు జిపిలకు మోక్షం...

భద్రాచలం, తాళ్లగొమ్మూరు గ్రామపంచాయితీలకు ఎట్టకేలకు మోక్షం లభించింది. గత బిఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాటు ఈ రెండు గ్రామపంచాయితీలకు ఎన్నికలు నిర్వహించలేదు. వీటిని మున్సిపాలిటీలుగా చేసేందుకు ఎన్నికలు జరపలేదు. వీటిని గ్రామపంచాయితీలుగానే కొనసాగించాలని కోర్టుకు వెళ్లడంతో ప్రక్రియ మళ్లీ మొదటికి వచ్చింది. భద్రాచలాన్ని గత బిఆర్ఎస్ ప్రభుత్వం మూడు పంచాయితీలుగా విభజించాలని యోచించినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఏక పంచాయితీగానే కొనసాగిస్తోంది. దీంతో డిసెంబర్‌లో జరగనున్న స్థానిక ఎన్నికల్లో భాగంగా పదేళ్ల అనంతరం భద్రాచలం, తాళ్లగొమ్మూరు గ్రామపంచాయితీలకు ఎన్నికలు జరగనున్నాయి.

# రిజర్వేషన్లపై అధికారుల కసరత్తు

**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** స్థానిక ఎన్నికలకు సంబంధించి రిజర్వేషన్ల కేటాయింపుపై అధికారులు కసరత్తు చేపట్టారు. రిజర్వేషన్లకు సంబంధించి ప్రభుత్వం జీవో విడుదల చేయడంతో సర్పంచ్, వార్డు సభ్యులకు సంబంధించి రిజర్వేషన్ల కేటాయింపుపై శనివారం అధికారులు చర్యలు చేపట్టారు. సర్పంచ్ స్థానాలకు సంబంధించి ఆర్డివో పరిధిలో జిల్లా యూనిట్‌గా రిజర్వేషన్లు కేటాయింపు చేయనుండగా వార్డు సభ్యులకు సంబంధించి మండల స్థాయిలో రిజర్వేషన్లు కేటాయించనున్నారు. రఘునాథపాలెం మండలంలో మొత్తం 37 గ్రామ పంచాయతీలకు సంబంధించి 308 వార్డులు ఉన్నాయి. వార్డుల్లో 50 శాతం జనరల్ కేటగిరికి కేటాయించగా మిగిలిన 50 శాతానికి సంబంధించి ఎస్సి, ఎస్టి, బిసిలకు సంబంధించి 2018 గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కేటాయించేందుకు అధికారులు కసరత్తు చేపట్టారు. మండల పరిధిలోని మొత్తం 37 గ్రామ పంచాయతీలు ఉండగా అందులో కొర్లబోడు తండా, లచ్చిరాంతండా గ్రామ పంచాయతీలు పూర్తి ఎస్టి జనాభా కలిగి ఉన్నాయి. ఎస్టిలకు 116, ఎస్సిలకు 24, బిసిలకు 20 వార్డులు రిజర్వేషన్లు కేటాయించినట్లు సమాచారం. అదేవిధంగా జిల్లా యూనిట్‌గా సర్పంచ్ ఎన్నికలకు రిజర్వేషన్లు కేటాయించడంతో రఘునాథపాలెం మండలంలో బిసిలకు ఒక సర్పంచ్ స్థానం కూడా కేటాయింపు లేనట్లు సమాచారం. 2018లో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గతంలో రిజర్వేషన్లు అయిన వాటికి రోటేషన్ పద్దతిలో ఇప్పుడు కేటాయింపులు జరపనున్నారు. త్వరలో గ్రామ పంచాయతీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో గ్రామాల్లో ఆశావాహుల సందడి నెలకొంది. పలువురు సర్పంచ్ స్థానాలకు పోటీ చేసేందుకు వివిధ పార్టీల నుంచి ఆసక్తి కనబరుస్తున్నారు. రిజర్వేషన్లు తమకు అనుకూలంగా వస్తే ఖర్చుకు వెనకాడకుండా పోటీ చేసేందుకు సిద్దమవుతున్నారు.



# గ్రామ పంచాయతీ ఎన్నికలకు రిజర్వేషన్లు ఖరారు




**ప్రజాపక్షం/కల్లూరు:** నిబంధనల ప్రకారం గ్రామపంచాయతీ ఎన్నికలకు సర్పంచ్‌ల రిజర్వేషన్లు ఖరారు చేసినట్లు కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ తెలిపారు. 50% రిజర్వేషన్ల మించకుండా లాటరీ పద్ధతి ద్వారా బీసీ అన్ రిజర్వాడ్ గ్రామపంచాయతీ సర్పంచ్‌ల రిజర్వేషన్లు ఖరారు చేసినట్లు సబ్ కలెక్టర్ శనివారం సాయంత్రం ఆయన విలేకరుల సమావేశాలు మాట్లాడుతూ రిజర్వేషన్లకు సంబంధించిన వివరాలు తెలిపారు. పెనుబల్లి మండలంలో మండలంలో 33 గ్రామ పంచాయతీలు ఉండగా 8 షెడ్యూల్ గ్రామపంచాయతీ లు ఉండగా వాటిలో నాలుగు స్త్రీలకు, నాలుగు ఎస్టీ జనరల్ కు కేటాయించారు..మిగిలిన 25 నాన్ షెడ్యూల్ పంచాయతీలలో ఎస్సి 5 ,బీసీ మూడు,ఆన్ రిజర్వుడు కు 13 సర్పంచులు కేటాయించారు. సత్తుపల్లి మండలంలో 21 పంచాయతీలలో మూడు షెడ్యూల్ కేటగిరీకి కేటాయించగా, మిగిలిన 18లో ఎస్టి, మూడు ఎస్సీ, నాలుగు బీసీ, రెండుకు అన్ రిజర్వుడుకు తొమ్మిది కేటాయించారు. కల్లూరు మండలంలో 23 గ్రామపంచాయతీలలో ఎస్టీ రెండు, ఎస్సి 7, బిసి రెండు, అన్రెర్వుడుకు 12 మంది సర్పంచులు ఉంటారు. తల్లాడ మండలంలో 27 గ్రామపంచాయతీలలో ఎస్టీ రెండు, ఎస్సీ 7, బిసి 4, ఆన్ రిజర్వుడుకు 14 సర్పంచులు ఉండనున్నారు. అదేవిధంగా మొత్తం 26 పంచాయతీలలో ఒక పంచాయతీ షెడ్యూల్ క్యాటగిరి, మిగిలిన 25 లో ఎస్సీ 7, బీసీ నాలుగు, అన్ రిజర్వ్ కింద 13 పంచాయతీలు కేటాయించారు. ఏన్కూరు మండలంలో మొత్తం 25 షెడ్యూల్ ఏరియా గ్రామపంచాయతీలు ఉన్నవి. వీటిలో 13 గ్రామపంచాయతీలు ఎస్టీ మహిళలకు, 12 పంచాయతీలు ఎస్టీ జనరల్ కు కేటాయించారు. మొత్తం 25 గ్రామపంచాయతీలలో ఒక పంచాయతీ షెడ్యూల్ కేటగిరికి మిగిలిన 26 పంచాయతీలలో ఎస్సీ 7, బీసీ 4, అండ్ రిజర్వుడుకు 13 పంచాయతీలను కేటాయించారు. ప్రకటించిన రిజర్వేషన్లను జిల్లా కలెక్టర్ ఆమోదం పొందిన తర్వాత గజిట్ నోటిఫికేషన్ విడుదల కానున్నట్లు సబ్ కలెక్టర్ విలేకరులకు తెలిపారు.

# తప్పుడు పత్రాలతో స్థలం ఆక్రమణ యత్నం



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** తప్పుడు పత్రాలు సృష్టించి తమ స్థలాన్ని అక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని బాధితురాలు రమాదేవి ఆరోపించారు. శనివారం బాధితురాలు రమాదేవి మీడియాతో మాట్లాడుతూ మండల కేంద్రమైన రఘునాథపాలెం ఎంపిడివో కార్యాలయం సమీపంలో సర్వే నెం.20లో గల మా ప్లాట్‌ను వేరే వ్యక్తులు ఫేక్ డాక్యుమెంట్ సృష్టించి అక్రమించే ప్రయత్నం చేస్తున్నారని ఆమె ఆరోపించారు. ప్లాటులో ఉన్న హద్దు రాళ్లను తొలగించి ఫెన్సింగ్ వేశారని ఆమె తెలిపారు. నాగరాజు అనే వ్యక్తి తప్పుడు పత్రాలు సృష్టించి అక్రమించేందుకు యత్నిస్తున్నారని ఆమె తెలిపారు. 2004లో తాము రూ. 30లక్షలకు దమ్మలపాటి రామలింగయ్య వద్ద కొనుగోలు చేశామని ఆమె తెలిపారు. ఇప్పుడు ఆ భూమి విలువ పెరగడంతో కొంత మంది అక్రమించేందుకు యత్నిస్తున్నారని దీనికి సంబంధించి రఘునాథపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆమె తెలిపారు. ఇదిలా ఉండగా రఘునాథపాలెం పోలీస్ స్టేషన్‌లో ఇరువర్గాలు ఫిర్యాదులు చేసుకోవడంతో ఇరువురిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు.

# ఆలయ నిర్మాణానికి స్థలం అప్పగింత



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో ఖమ్మంలో నిర్మించనున్న శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి సంబంధించిన స్థలాన్ని రెవెన్యూ అధికారులు దేవాదాయ శాఖకు శనివారం అప్పగించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేకంగా చొరవ తీసుకుని టిటిడి ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి చర్యలు చేపట్టారు. ఆలయ నిర్మాణానికి సంబంధించి 20 ఎకరాల భూమిని ఖమ్మం నగరంలోని 15వ డివిజన్ కొత్తగూడెం అల్లిపురం ప్రాంతంలో గుర్తించారు. దానికి సంబంధించి 17.24 ఎకరాల ప్రభుత్వ భూమిని తొలుత దేవాదాయ శాఖకు అప్పగించేందుకు ఉత్తర్వులు జారీ చేశారు. మిగిలిన అసైన్డ్ భూమిని కూడా స్వాధీనం చేసుకుని దేవాదాయ శాఖకు అప్పగించనున్నారు. ఈ మేరకు ఖమ్మం అర్బన్ తహసీల్దార్ సైదులు, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ వీరస్వామికి భూ కేటాయింపుకు సంబంధించి పత్రాలను అందజేశారు. భూమి కేటాయింపు జరగడంతో త్వరలోనే ఆలయ నిర్మాణానికి సంబంధించి పనులు ప్రారంభం కానున్నాయి. అదేవిధంగా రఘునాథపాలెంలో సర్వే నెం. 30లో 4.20 ఎకరాల ప్రభుత్వ భూమిని ఇస్కాన్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆలయ నిర్మాణానికి కేటాయించారు. త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి. ఈ రెండు ఆలయ నిర్మాణాలు పూర్తయితే ఖమ్మంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకోనుంది.

# రేపే ఎన్‌టిఆర్ విగ్రహ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండలం దారుక బంజర గ్రామంలో ఏర్పాటు చేసిన మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం 24వ తేదీ సోమవారం ఉదయం 11 గంటలకు జరుగుతుందని దారుక బంజర్ ఎన్టీఆర్ అభిమాన సంఘం తెలిపారు. ఈ కార్యక్రమానికి టీడీ జనార్ధన్, ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ చైర్మన్ చింతమనేని ప్రభాకర్, దెందులూరు శాసనసభ్యులు, స్థానిక ముఖ్య నాయకులు, తెలుగుదేశం పార్టీ నాయకులు హాజరుకానున్నట్లు అభిమాన సంఘం దారుక బంజర గ్రామస్తులు తెలిపారు.

# భట్టి పర్యటనకు కదిలిన కాంగ్రెస్ నాయకులు



**ప్రజాపక్షం/వైరా:** వైరాలో జరిగిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క పర్యటనకు మున్సిపాలిటీ పరిధిలోని ఒకటో వార్డులో పట్టణ కాంగ్రెస్ నాయకుడు వీరంశెట్టి సీతారాములు ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు బైక్ ర్యాలీతో భారీగా బయల్దేరి స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్దకు వచ్చి భట్టివిక్రమార్కకు స్వాగతం పలికారు. అనంతరం అక్కడి నుండి గురుకుల పాఠశాల వరకు జరిగిన ర్యాలీలో వారు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వీరంశెట్టి సీతారాములు, బిడికె.వెంకన్న, దురిశెట్టి నర్సింహారావు, మోర్ శ్రీకాంత్, నడిపి, దురిశెట్టి నరస, దుగ్గిరాల జాకోబు, మరికంటి రాంగోపాల్ వర్మ, దుగ్గిరాల మహేష్, మొకర అశోక్, లక్ష్మణ్, మోర్ ప్రభాకర్, భువనాద్రి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.